# కోర్టు విచారణ*

**కథానిక**

ఆనంద వాసుదేవన్

జార్జి థాంప్సన్, బులవాయోలో నివసించే ఒక ప్రముఖ యూరపియన్. ఆయన చాల ధనవంతుడు; ఎన్నో వ్యాపారా లున్నవాడు; అపారమైన పొగాకు తోటలకు అధిపతి తన మత మన్నా, తన జాతి అన్నా ఆయనకు ప్రాణం. ధనాన్ని ఖర్చుచేయడంలోను, యితరుల్ని సేవించడంలోను ఆయన బహు ఉదారుడు. బృందగానాల్లో ఆయనకు ఆయనే సాటి ఆయనంత శ్రావ్యంగా పాడగలవారు రొడీషియాలోనే లేరంటారు. దేశం మొత్తంమీద ఆయనంత సరసుడు లేనేలేడు. ఆయనకొక బ్రహ్మాండమైన ఆయుధాగారం కూడా ఉంది.

ఆయనంటూ ఉంటారు: "ఈ నాటు జనాన్నెప్పుడూ నమ్మకూడదు; సరిహద్దుకు అతి దగ్గరలోనే ఉంటారు, అ కమ్యూనిస్టుగాళ్ళు."

అయితే, నల్లవాళ్ళవల్ల థాంప్సన్‌కి ఎప్పుడూ యిబ్బంది కలగలేదు. కారణ మేమంటే, వాళ్ళనెలా మచ్చిక చేసుకోవాలో ఆయనకు తెలిసినంత బాగా మరెవరికీ తెలియదు.

"అసలు, దొర ఎవరో వాళ్ళు తెలుసుకొనేటట్లు చెయ్యి!" అంటారాయన పెద్ద గొంతుతో. "అప్పుడన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి అప్పుడు కొరడా అవసరమే ఉండదు. నేను గత మూడేళ్ళలో ఒక్క నల్లవాణ్ణైనా నా చేత్తో హింసించలేదంటే మీరు నమ్ముతారా? మెమ్మెమ్మేలూ, పెప్పెప్పేలూ. నీ కసహ్యమని వాళ్ళ కర్థమయేలా చెయ్యి. కాస్త సందేహించావో, నీ పని క్లోజ్"!

ఇవీ, థాంప్సన్ నమ్మకాలు

ఒక చక్కని స్త్రీని ఆయన పెండ్లాడాడు. వారి కొక కొడుకూ, ఒక కూతురూను. కొడుకు ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నాడు. కూతురికి పెండ్లి నిశ్చయమైంది. ఆయన పార్లమెంటు సభ్యుడు కాకపోయినా, ఎన్నికలో నైతే ఆయన మాటే చెల్లుతుంది.

* రొడీషియాలో న్యాయస్థానాలు నీగ్రోలకు ప్రసాదిస్తున్న న్యాయం ఏపాటిదో చిత్రించే చక్కని కథ సౌందర్య స్ఫురణ లేని మరొక రచయిత దీన్ని పేలవమైన ఒక ప్రచార సాధనంగా తయారు చేయగలడు.

ఇట్టి వ్యక్తిమీద వచ్చింది, ఒక అభియోగం. ఈయన నొకరోజున నిర్లక్ష్యంగా వ్యవహరించడంవల్ల ఒక నీగ్రో పిల్లవాడు చనిపోయాడు. వాడు తన యింట్లో పనిచేసేవాడే.

నేను న్యాయాధికారిని గనుక, యిది నా ముందు విచారణ కొచ్చింది. కాని, విచారణకు చాలా రోజులు ముందు యిది ఒక విపరీత పద్ధతిలో నా దృష్టి కొచ్చింది. ఒకరోజు ఉదయం కోర్టు బయట పెద్ద గలభా జరుగుతోంది. చాల మంది నీగ్రోలు రోడ్డుమీద మూగి, పెడ బొబ్బలు వేస్తున్నారు. నేను కోర్టు భద్రతా దళానికి చెందిన సార్జంట్ ఫాలన్‌ని పిలిచి, సంగతేమిటో తెలుసుకొని రమ్మన్నాను. అతను బయటికెళ్ళి, కాస్సేపయాక తిరిగివచ్చి, యిలా అన్నాడు:

"వాళ్ళు థాంప్సన్‌గారిని గురించి ఏలినవారితో ఏదో మనవి చేయాలను కొంటున్నారండి "

నేను, వాళ్ళలో ఒక వ్యక్తిని తీసుకు రమ్మన్నాను. స్వహీలీ భాషను అనువదించగల మరొకనినికూడా తెమ్మన్నాను.

ఒక మధ్యవయస్కురాలు గుంపులో నుంచి కోర్టులోకి వచ్చింది. తాను వితంతువు ననీ, థాంప్సన్ మూలంగా మరణించినట్లు చెప్పబడే నీగ్రో బాలుని తల్లిననీ చెప్పింది.

"ఈమె నాతో ఏమి చెప్పదలచు కొంది?" అని నే నడిగాను.

"తన కొడుకు థాంప్సన్‌చే చంపబడ్డాడని ఈమె అంటోంది. వాని శరీరం తనకు యివ్వలే దంటూంది."

"కాని, యీ విషయంలో నే నివ్వ దేమి చేయగలను? పోలీసువద్దకు వెళ్ళమని ఆమెతో చెప్పు."

"తా నిదివరకే పోలీసుకు ఫిర్యాదు చేశానంటూంది. కాని, వాళ్ళేమీ చేయలేదట."

"ఎందుచేత? తన కొడుకు హత్య చేయబడ్డాడని యీమె అనుకొంటూందా?"

"థాంప్సన్ లోగిట్లోనే పనిచేస్తున్న యింకో పిల్లవాడు ఈమెతో చెప్పాడట - ఆ యజమాని జోసెఫ్ పట్ల ఉగ్రుడై పొలికేకలు పెట్టేడట; లోపలికెళ్ళి తుపాకి తెచ్చేడట; జోసెఫ్ పారిపోడానికి ప్రయత్నించాడట; కాని తుపాకి గుండుకు చనిపోయాడట."

"ఇదంతా నమ్మడానికి వీల్లేకుండా వుంది. అయితేనేం, ఫరవాలేదు నేనిది విచారిస్తానని ఆమెతో చెప్పండి. ఇక ఆమె వెళ్ళిపోవచ్చు."

ఆ సాయంత్రం నేను పోలీసు సూపరింటెండెంటు బ్రౌన్‌ని నా దగ్గరకు రమ్మని ఫోన్ చేశాను. ఆయన వచ్చారు. తాను తెలుసుకున్న భోగట్టా చెప్పారు.

"ఇదంతా కమ్యూనిస్టుగాళ్ళ గొడవండీ. వాళ్ళు థాంప్సన్ నెత్తురు చూడాలనుకుంటున్నారు. ఆయనను గురించి నీచాతినీచమైన వదంతులు సృష్టించారు. అవన్నీ మీరు విన్నవే గదండీ. నీగ్రో వాణ్ణి ఆయన దారుణంగా హత్యచేశారని వీళ్ళంటున్నారు.

"అసలు, ఏమి జరిగిందని మీ అభిప్రాయం?"

"అది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన. ఒకరోజున థాంప్సన్‌గారు తన

రైఫిళ్ళలో ఒకటి పైకితీసి శుభ్రపరుస్తున్నారు. అందులో తూటాలున్నాయని ఆయనకు తెలియదు. చేతిలో నుంచి గుండు దూసుకెళ్ళి కుర్రవెధవ వీపుకి తగిలింది. వెంటనే థాంప్సన్‌గారు వాణ్ణి తన కారులో ఎక్కించుకొని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. నిజానికాయన యూరపియన్ల ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ వానికి చాలా బాగా చికిత్స చేస్తారని అలా చేశారు. కాని, ఉపయోగం లేక పోయింది. అక్కడికి వెళ్ళిన వెంటనే పిల్లవాడు చచ్చిపోయాడు."

"వాని శరీరాన్ని బంధువుల కీయ లేదనే మాట నిజమేనా?"

"నిజమేనండి. నేను మీకు చెప్పినట్లు, అది యూరపియన్ల ఆసుపత్రి. మొదటి విషయమేమంటే, అక్కడొక నీగ్రోకు చికిత్స చేయడం పెద్ద పొరపాటు. వాళ్ళక్కడ మృతదేహాన్ని అట్టే పెట్ట లేదు. అలాచేస్తే కొత్త యిబ్బంది లొచ్చిపడతాయి. బంధువుల విషయమంటారా, వాళ్ళెవరూ అక్కడ కనిపించలేదు. అందుచేత మృతదేహాన్ని బయటికి తీసుకెళ్ళి పూడ్చిపెట్టారు."

నేనన్నాను: "ఇది నాకు సంబంధించింది కాదనుకోండి, బ్రౌన్‌గారూ. అయినా, నేనొక మిత్రునిగా మాట్లాడుతున్నాను. మీరు ఏ చర్యా తీసుకోకపోతే, ఒక దొమ్మి జరిగి యుండేది. అలాకాక, ఏదో ఒక చర్య తీసుకుంటే ఏమైయుండేదంటారు? మహా అయితే, థాంప్సన్ కొంత నష్టపరిహారం చెల్లించవలసి వచ్చేది. అలా చేసియుండవలసిందని మీరనుకోడం లేదా?"

ఆ విధంగా ఆ కేసు నా కోర్టుముందుకొచ్చింది. విచారణ కొద్దినెలల తర్వాత ప్రారంభమయింది. థాంప్సన్ ఒక ప్రమాదకరమైన ఆయుధాన్ని నిర్లక్ష్యంగా పట్టుకోవడంవల్ల ఒక నీగ్రో చనిపోయాడనేది ఆయనమీద అభియోగం. సమర్థుడైన సర్ ఛార్లెస్ బింటన్ ప్రాసిక్యూషన్ నడిపారు (మరుసటి సంవత్సరం, ఘనతవహించిన మహారాణి జన్మదినోత్సవం నాడు ఆయన సర్ ఛార్లెస్ అయారు). కాని, కమ్యూనిస్టుగాళ్ళు అక్కడి విషయాలతో అసంతృప్తి చెంది, తల్లి తరఫున వాదించడానికొక భారతీయ లాయరును నియమించారు.

వీడు, అనగా ఈ భారతీయుడు, వట్టి పనికిమాలిన వాడుగా వ్యవహరించి, తానుతీసుకున్న ఫీజుకు మంచి ఉపకారమే చేసిపెట్టాడు. వెనువెంటనే అతడు, భారతీయునికుండే తలపొగరుతో, థాంప్సన్‌ని బోనులో నిలబెట్టాడు. మొట్టమొదట ఆయన్నిలా ప్రశ్నించాడు:

"థాంప్సన్‌గారూ, ఆ-ఈ ప్ర-మా-దం జరిగిన తర్వాత ఏ ఆసుపత్రికైతే మీరు జోసెఫ్‌ని తీసుకెళ్ళారో, ఆ ఆసుపత్రిలో మీ భార్య చికిత్స పొందుతున్నారా?"

ఈ ప్రశ్నకు డిఫెన్స్ లాయరు అభ్యంతరం చెప్పారు. కేసుకూ, దీనికీ సంబంధం లేదన్నారు. థాంప్సనే అన్నారు: "నన్ను థాంప్సన్‌గారని పిలవకండి. 'అయ్యా' అని పిలవండి."

అప్పుడు భారతీయుడు అతి నున్నని యిగిలింపు మొగం నావైపు తిప్పి,

అన్నాడు: "ఇప్పుడే ఏలినవారికి నా అభిప్రాయ మేమిటో మనవి చేస్తాను." నే నతని ప్రశ్నకు అనుమతి ఇచ్చాను. భారతీయుడు మళ్ళీ ముద్దాయి వైపు తిరిగి, అడిగాడు: "సరే, అయ్యగారూ, తమ భార్యగారు అప్పుడా అసుపత్రిలో రోగిగా ఉన్నారా?"

"ఆ, ఉన్నారు."

"మూత్రపిండం చెడిపోవడమనే వ్యాధితో ఆమె బాధపడుతున్నారా?"

"వైద్యశాస్త్రానికి సంబంధించిన ప్రశ్న లడగవద్దు. నేను వైద్యుణ్ణికాను."

"కాని, తమరు చెప్పినదాన్నే నేను ఉటంకిస్తున్నాను. అయ్యా, థాంప్సన్ గారూ, తమరు గత సెప్టెంబరు 17 వ తేదీ 'రొడీషియా హెరాల్డ్' పత్రికలో ఒక ప్రకటన చేస్తూ, సరిగ్గా ఆ శబ్దాన్నే ఉపయోగించారండీ: మూత్రపిండం చెడిపోవడమనే వ్యాధితో మీ భార్య బాధపడుతున్నారనీ. ఎ-బి గ్రూపుకు చెందిన రక్తం గలవారెవరైనా ఆమెకు తన మూత్రపిండ మీయవలసిందనీ తమరు ఆ ప్రకటనలో కోరారు."

నేను అంతా వింటున్నాను. ప్రతి వారూ అత్యంతాసక్తితో వింటున్నారు.

"ఆ ప్రకటన యిచ్చింది డాక్టర్లు; నేను బిల్లు మాత్రమే చెల్లించాను."

"ఆ విజ్ఞప్తికి ఎవరైనా జవాబిచ్చారా?"

"వెంటనే యివ్వలేదు. కొద్దిరోజుల తర్వాత శాలిస్‌బరీ నుంచి ఒక పెద్దమనిషి వచ్చి తన మూత్రపిండాల్లో ఒక దాన్ని అమర్చుకోడానికి అనుమతించాడు."

"ఆ పెద్దమనిషి పేరు ఏమిటో కోర్టు వారికి తెలియజేయగలరా?"

"వీల్లేదు. ఆ పెద్దమనిషి తన ఊరు, పేరు చెప్పవద్దన్నాడు."

"ప్రస్తుతం విచారణ జరుగుతున్న ఘటనకు ముందురోజు తమరు జోసెఫ్ అను తమ ఇంటి కుర్రవాణ్ణి ఆసుపత్రికి తీసుకెళ్ళి, వాని రక్తం ఏ గ్రూపుకు చెందిందో పరీక్ష చేయించారా?"

"లేదు. వాడు తనంత తానే వెళ్ళి యుండవచ్చు."

"సరే. వాని రక్తం ఏ గ్రూపుకు చెందిందో తెలుసుకున్నారా? అది ఎ-బి గ్రూపుకు చెందిందేనా?"

"నాకెలా తెలుస్తుంది? నీగ్రోల రక్తపు గ్రూపులు నాకు తెలియవు."

"కాని, థాంప్సన్‌గారూ- అయ్యా- తమ భార్యకోసం ఒక మూత్రపిండాన్ని దానం చేయడానికంగీకరిస్తున్నట్లు జోసెఫ్ చేత మీరు సంతకం చేయించుకున్నారనుకుంటాను?"

"అయితే కావచ్చు కాని, నేను మీ కిదివరకే చెప్పాను- శాలిస్‌బరీ నుంచి వచ్చిన పెద్దమనిషి మమ్మల్ని కాపాడేడని."

"ఆ పెద్దమనిషి, ఏ ప్లాక్ వల్ల నయినా, సరిగ్గా జోసెఫ్ కాల్చబడిన రోజునే వచ్చి, ఆ సాయంత్రమే తిరిగి వెళ్ళిపోయాడా?"

"ఇదిగో, మనిషీ, వెటకారం వద్దు! అతడు వచ్చిన మాట నిజమే. కాని, జోసెఫ్ కాల్చబడలేదు."

"అయితే, ఆ పెద్దమనిషి ఉదయం వచ్చి, పదకొండు గంటలకు మూత్రపిండాన్ని తీయించేసుకొని, మధ్యాహ్నం రెండు గంటలకు బయల్దేరే విమానంలో శాలిస్‌బరీకి తిరిగి వెళ్ళిపోయాడన్న మాట. అంతేనాండీ?"

మళ్ళీ నన్ను వైద్యశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నల్లోకి లాగవద్దు!"

"అయ్యా, యిది వైద్యశాస్త్రానికి సంబంధించిన విషయం కాదు. ఆ పెద్దమనిషి ఆపరేషను అయిన మూడు గంటల్లో శాలిస్‌బరీకి తిరిగి వెళ్ళిపోయాడా? అని మాత్రమే అడుగుతున్నాను."

"ఔను; వెళ్ళిపోయాడు."

"తమ భార్య మాత్రం, ఆపరేషను జరిగిన పదిరోజులవరకు ఆసుపత్రిలోనే ఉన్నారనుకుంటాను?"

"ఉండియుండవచ్చు; నాకు జ్ఞాపకం లేదు."

"థాంప్సన్‌గారూ, అయ్యా, ఇప్పుడు నేను తమతో అంటున్నాను— శాలిస్‌బరీనుంచి వచ్చిన పెద్దమనిషి అంటూ ఎవరూ లేరు. జోసెఫ్ అనే పిల్లవాణ్ణి తమరు మోసగించి, తన మూత్రపిండాన్ని కోసుకోడానికి అంగీకరిస్తున్నట్లు అతని నుంచి సంతకం తీసుకున్నారు. ఈ జోసెఫ్, తాను సంతకం చేసిన పత్రం ఎట్టి స్వభావం గలదో తెలుసుకున్న తర్వాత, తమతో కలసి ఆసుపత్రికి వెళ్ళడానికి నిరాకరించాడు. తమరు వానికి డబ్బు యివ్వబోయారు. కాని అతడు తీసుకోవడానికి నిరాకరించాడు. అప్పుడు తమరు కోపోద్రిక్తులై వానిని బెదిరించారు. జోసెఫ్ భయకంపితుడై తమనుంచి పారిపోసాగేడు. తమరు రైఫిలు తీసుకొని వాని వీపు మీద కాల్చారు. అప్పుడు తమరు, చనిపోతున్న ఆ వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్ళి, తమలాంటి అమానుషులే అయిన డాక్టర్ల బృందం వానిచేత మూత్రపిండాన్ని కోయించి అతికింపచేశారు"

కోర్టులో పెద్ద అలజడి రేగింది. అక్కడి నుంచి నీగ్రోలందరినీ నేను బయటికి పంపివేయవలసి వచ్చింది. ఆ పొగరుబోతు భారతీయుణ్ణి యికమాట్లాడకుండా అపుజేశాను. ఈ అర్ధ నాగరికత జాతుల్ని కోర్టులోకి రానిస్తే, వాళ్ళు న్యాయశాస్త్ర విధుల్ని ఉల్లంఘిస్తారని నేను మొదటినుంచీ అనుమానిస్తూనే వచ్చాను. నీవు భారతీయునికి వెయ్యి సంవత్సరాలు బోధించినా, బ్రిటిష్ శాస్త్రంలోని మెళకువలు వానికి అర్థం కావు. ఒక సరళమైన కేసు జాతుల సమస్యపై అభిప్రాయాలు వెలిబుచ్చే సాధనంగాను, రాజకీయ సర్కసుగాను వక్రీకరింపబడి, అనేక అసందర్భమైన ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. అందుచేత, నేను మొత్తం విచారణను రికార్డు నుంచి తొలగించవలసిందిగా ఉత్తరువు జారీ చేయవలసి వచ్చింది.

అయితే, బ్రిటిష్ న్యాయం కలుషితం కాకుండా చూడాలని నేను నిశ్చయించుకున్నాను. థాంప్సన్‌కి కఠినమైన శిక్ష విధించాను. కోర్టు లేచేవరకు ఆయన జైలుశిక్ష అనుభవించాలి. (పత్రికలు ఈ తీర్పును విమర్శించాయి. ఈ విధమైన నేరాలు చేసే యూరపియన్లు ఇకముందు శిక్షింపబడకుండాపోతారని ఆక్షేపించాయి) రెండువందల పౌనులు జుల్మానా కూడ విధింపబడింది. అది మృతుని తల్లికి చెల్లించాలి.

ఆ సొమ్ము తీసుకోడానికి నీగ్రో స్త్రీ వెళ్ళలేదని తర్వాత నేను విన్నాను. ఆఫ్రికన్ల పద్ధతులు అంతు చిక్కవు!

థాంప్సన్ సతి మూత్రపిండం ఒకటి నీగ్రో జాతి వానిదని ఆమె స్నేహితురాళ్ళు అప్పుడప్పుడు చెప్పుతూ ఉంటారని నేను విన్నాను. కాని, అది నీగ్రోవానిదైనా, శ్వేతముఖునిదైనా, చాల చక్కగా పనిచేస్తున్నట్లే కనిపిస్తుంది.

ఇక ఆ పాడు భారతీయ లాయరు విషయం. అతడేమయ్యాడనేది వేరే విషయం. కాని, ఒకటి మాత్రం నేను చెప్పగలను. అదేమంటే, వానికి ఏదైనా సంభవించిందో దానికతడు సర్వవిధాలా అర్హుడు!

("ఇలస్ట్రేటెడ్ వీక్లీ" సౌజన్యంతో)

అడపిల్ల అస్తమానం అలానవ్వకూడదనీ,
కాస్త గాంభీర్యం నేర్చుకోమని
ఎందుకలా గొంతు చించుకుంటావు-
వెళ్ళి-ఆగోడచాటు ఇల్లాళ్ళని అడిగిచూడు
మొహాలు ముడుచుకుంటున్నందుకు విసుక్కుంటూ
వాళ్ళ మొగుళ్ళు
ఆడదంటే నవ్వులపువ్వులా తుళ్లుతూండాలని
మొత్తుకుంటూంటాడు!